క్లుప్తంగా

బహుమతుల ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

వనస్థలిపురం: ఢిల్లీలో ఈ నెల 6న జరిగిన 12వ ఏహెచ్‌పీఎస్ మెగా కాంపిటీషన్స్‌లో తమ విద్యార్థులు సత్తా చాటారని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం హిల్‌కాలనీలోని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. వనస్థలిపురం బ్రాంచి నుంచి 25 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచారన్నారు.

కార్పొరేటర్‌కు వినతి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: గాయత్రీనగర్ ఫేజ్–2 కాలనీ అభివృద్ధికితన వంతు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. కాలనీ నూతన కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా కాలనీ సమస్యలపై కార్పొరేటర్ లచ్చిరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సమస్య పరిష్కారం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాలనీలో మట్టి రోడ్లతో ఇబ్బందులు పుతున్నామని నూతన రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు.వినతి ఇచ్చిన వారిలో చందు నాయక్, వంశీకృష్ణ, శరత్‌బాబు, నవీన్‌కుమార్, సుధాకర్, గణేష్‌యాదవ్,బాలకృష్ణ, ఖాజాహుస్సేన్ ఉన్నారు.

శబరిమల మహాపాదయాత్ర ప్రారంభం



శబరిమలకు పాదయాత్రతో తరలివెళ్తున్న అయ్యప్ప భక్తులు

బడంగ్‌పేట్: కర్మాన్‌ఘాట్ హరిహర క్షేత్రం నుంచి శబరిమల వరకు శనివారం అయ్యప్ప భక్తులు మహాపాదయాత్ర మొదలుపెట్టారు. ఈ కార్యక్రమాన్ని సందీప్‌రెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, సునీల్ మోహన్, దిండు బూపేశ్‌గౌడ్ పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. 150 మంది అయ్యప్ప భక్తులు పాదయాత్ర చేస్తున్నారు. వారికి అన్ని శుభాలు కలగాలని అయ్యప్పను వేడుకున్నారు. కుటుంబ సభ్యులు అయ్యప్ప స్వాములను ఆశీర్వదించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే..

మలక్‌పేట: దీపావళి సందర్భంగా తాత్కలిక దుకాణాలు ఏర్పాటు చేసి బాణాసంచా విక్రయించే వారు భద్రతా ఏర్పాట్లలో హద్దులు మీరితే చర్యలు తప్పవని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు పోలీసుల అనుమతి తప్పకుండా తీసుకోవాలని, తాత్కలిక దుకాణాలను షీట్స్(రేకులు)తో మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యమైన కరెంట్ తీగలు మాత్రమే వాడాలని, తడకలు, బట్టలు వాడరాదన్నారు. షెడ్ వద్ద నీళ్లు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బాణాసంచా సామగ్రి జప్తు చేసి కేసు నమోదు చేస్తామన్నారు.

అధికారుల నిర్లక్ష్యం సరికాదు

మన్సూరాబాద్: కాలనీలో నెలకొన్న సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఆటోనగర్ నుంచి డబుల్ బెడ్రూమ్ సముదాయాల వరకు నిర్మించిన వరదకాలువల్లో వ్యర్థాలు, డ్రైనేజీ మురుగు పారుతుందని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు శనివారం ఆయన నాలాను పరిశీలించి మాట్లాడారు. వరదకాలువలో అక్రమంగా కలిపిన డ్రైనేజీ లైన్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. హయత్‌నగర్ పరిధి శివంహిల్స్, వీరన్నగుట్ట, కేవీఎన్ రెడ్డినగర్‌లో విద్యుత్ అధికారులు నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ మిర్జావుద్దీన్, సిబ్బంది, ఆయా కాలనీల వాసులు పాల్గొన్నారు.



కందుకూరు: ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులు



కందుకూరు: మానవహారంగా ఏర్పడిన వివిధ పార్టీల నాయకులు



తుక్కుగూడ: బంద్‌లో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు

బంద్ విజయవంతం

జీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కేవరకు పోరాటం ఆగదని పలువురు వక్తలు అన్నారు. బీసీ సంఘాల పిలుపుతో శనివారం మహేశ్వరం నియోజకవర్గంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం పార్టీలతో పాటు ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, జీసీ సెల్, ఎస్ఎఫ్ఐ, తదితర సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థలకు ముందుగానే సెలవు ప్రకటించారు. అనంతరం నేతలు గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీ నిర్వహిస్తూ వ్యాపార సంస్థలను, దుకాణాలు మూసి వేయించారు. రోడ్డుపై భైఠాయించి ఆందోళన చేశారు.



బడంగ్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బడంగ్‌పేట్: రోడ్డుపై బైఠాయించిన బీసీ సంఘాల నాయకులు



మహేశ్వరం: నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు



మహేశ్వరం: తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు

ప్రజలందరి సహకారంతోనే బంద్ ప్రశాంతం

షాద్‌నగర్‌రూరల్: బీసీ రిజర్వేషన్ కోసం చేపట్టిన బంద్ ప్రజలందరి సహకారంతో ప్రశాంతంగా ముగిసిందని ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పట్టణ సీఐ విజయ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ కోసం చేపట్టిన రాష్ట్ర బంద్ కార్యక్రమం నియోజకవర్గంలో ఎలాంటి అలజడులు లేకుండా ప్రశాంతంగా సాగిందన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, మద్యం మత్తులో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అపరిచిత వ్యక్తులు ఎక్కడ కనిపించినా పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను చిత్తు చేసుకోవద్దన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలందరి సహకారం మరువలేనిదన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత



నాదర్‌గుల్‌లో లబ్ధిదారులకు ఇందిరమ్మ పట్టాలు అందజేస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: ఇంటి స్థలం ఉండి ఇళ్లు కట్టుకునేవారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం శాశ్వత గూడు కల్పించేలా చేస్తోంది. మొదటగా లబ్ధిదారులు అయిష్టంగా ఉన్నప్పటికీ లబ్ధిదారులకు బిల్లులు టెంచన్‌గా వారి అకౌంట్‌లో పడుతుండటంతో ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులు పోటీపడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని నాదర్‌గుల్‌లోని 8, 9, 27 డివిజన్‌లలో కొత్తగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల మంజూరుపత్రాలు శనివారం వార్డు కార్యాలయం వద్ద అబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్, నాయకులు పుట్టగళ్ల జగన్, బంగారు అశోక్, మురళీ, యాతం కుమార్, జనార్థన్, నర్సింగ్‌రావు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

బాలాపూర్‌లో..

కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో 15వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల మంజూరుపత్రాలను శనివారం కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో 15వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు బాల్‌నింగని జంగయ్య, కమిటీ సభ్యులు నీరుడి శ్రీరాములు, క్యారగారి శ్రీధర్, ఉపశ్రీశివకుమార్, వార్డు అధికారి రమేశ్, కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు, సురేందర్, రమేశ్, రవికుమార్, కవిత, రీచల్, పెంటమ్మ, గిల్ల కవిత, యాదమ్మ తదితరులు ఉన్నారు.

‘బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్’

మొయినాబాద్‌రూరల్: 42 శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేఖ ధోరణి అవలంభిస్తోందని బీజేపీ బీసీ మోర్చా చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ ఎలిగని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని బాకారంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను రోడ్డు పాలు చేస్తోందన్నారు. కుల గణన పేరుతో 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని చెప్పి మాయమాటలతో ప్రజలను మోసం చేస్తూ నేడు 42 శాతం రిజర్వేషన్ కల్పించకుండా కోర్టుల చుట్టూ కాలయాపన చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహిస్తే గ్రామాలు అభివృద్ధి చెందేవన్నారు. ఏ గ్రామంలోనైనా ప్రజాపాలన ఉంటేనే ప్రజలకు అన్ని సౌకర్యాలు కలుగుతాయని అధికారుల పాలనలో పరిపాలన అందలేకపోతోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి 42 శాతం బీసీ రిజర్వేషన్‌లు అమలు చేస్తూ ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీలను మోసం చేస్తున్నది కాంగ్రెస్, బీజేపీలే

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు మంజుల

మొయినాబాద్: రాష్ట్రంలో బీసీలను మోసం చేస్తున్నది కాంగ్రెస్, బీజేపీ లేనని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు ముదిగొండ మంజులరవియాదవ్ ఆరోపించారు. శనివారం మున్సిపాలిటీలోని హిమాయత్‌నగర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి వాటిని అమలు చేయకుండా హైకోర్టు, సుప్రీంకోర్టు కేసులంటూ బీసీలను మోసం చేస్తోందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండటానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమన్నారు. అన్ని రాష్ట్రాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు బీసీల ఓట్లు కావాలే తప్పా బీసీలపై ప్రేమలేదని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని కనకమామిడి తాజా మాజీ సర్పంచ్ పట్లోళ్ల జనార్దన్‌రెడ్డి అన్నారు. గతవారం రోజులుగా మండల పరిధిలోని కనకమామిడిలో నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మూఢనమ్మకాలు, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛమైన నీరు తాగడం, రైతులు అవగాహన వంటి అంశాలు ఎంతో ఆదర్శంగా ఉన్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. విద్యార్థులు చేపట్టిన జాతీయ సేవా కార్యక్రమం ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యకు పరిమితం కాకుండా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బల్వంత్‌రెడ్డి, జగదీశ్వర్‌చారి, దయాకర్, కళాశాల కరెస్పాండెంట్ సరోజా, వివేకానంద, ప్రిన్సిపాల్ మట్ట శేఖర్, ప్రోగ్రామ్ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

పశువైద్యాధికారి దేవిరెడ్డి

మొయినాబాద్‌రూరల్: మండలంలో ఇప్పటి వరకు 300లకుపైగా పశువులకు గాలికుంటు టీకాలు వేశామని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామ సమీపంలోని డెయిరీ ఫామ్‌లలో పశువులకు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర శ్రీనివాస్, ఓఎస్ రవి పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడలో ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజు ఆహారంలో చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, పాలు, పండ్లు, గుడ్లు విధిగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శివకుమార్, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు లావణ్య, తులసి, ప్రగతి, శృతి, ఏఎన్‌ఎం సునీత, అంగన్‌వాడీ టీచర్లు రజిత, హేమలత, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే పేద విద్యార్థులకు దాతలు అందించే సహకారం మరువలేనిదని హెచ్‌ఎం నీరజ అన్నారు. మండలంలోని ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రామానికి చెందిన రిటైర్డు ఉద్యోగి, దాత కొత్తకాపు నర్సింహారెడ్డి విద్యార్థులకు నోటుపుస్తకాలు, స్టేషనరీ, టిఫిన్ బాక్స్‌లు, దుప్పట్లు స్థానిక నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులను ప్రోత్సహించేందుకు గ్రామంలోని దాతలు ముందుకొచ్చి సహాయ సహకారాలు అందించటం అభినందనీయమన్నారు. దాతలు అందించే సహకారం విద్యార్థులు ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జనార్ధన్ రెడ్డి, విజయ్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రమోద్, కృష్ణగౌడ్, స్వాతి, అరుణ, అనంతయ్య, వెంకటేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు ఆర్థికసాయం

నందిగామ: మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో నిత్యపూజలు చేస్తున్న అర్చకులకు అదే గ్రామానికి చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ రేగొండ రవీందర్‌రెడ్డి శనివారం ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి చేతుల మీదుగా రూ.40 వేల నగదును అర్చకులకు అందజేశారు. దాత రవీందర్‌రెడ్డిని అర్చకులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, దారలింగం తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు అమలయ్యేవరకు పోరాటం చేస్తాం



మాట్లాడుతున్న బీసీ నేతలు

మీర్‌పేట: 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం చేస్తామని కార్పొరేషన్‌కు చెందిన పలువురు బీసీ నాయకులు స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సేన సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఇచ్చిన బంద్‌కు బీసీ నాయకులు మద్దతు ప్రకటించి, అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీల రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్, బీజేపీలు దొంగ నాటకాలు ఆడుతున్నాయని, వెనుకబడిన తరగతుల హక్కులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించొద్దన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు సునీతబాల్‌రాజ్, మాజీ కార్పొరేటర్ అనిల్‌యాదవ్, నాయకులు సిద్దాల బీరప్ప, నవీన్‌గౌడ్, సిద్దాల అంజయ్య, గడ్డమీది లక్ష్మణ్, సిరూర్ బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలి

కందుకూరు: రైతులకు న్యాయం జరిగేలా కందుకూరు సొసైటీ నుంచి సకాలంలో రుణాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సొసైటీ డైరెక్టర్ ఎస్.శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పాత, కొత్త చైర్మన్ల విషయంలో పీడిముడి పడిందన్నారు. కోర్టు తీర్పు ప్రభుత్వం అమలు చేయకపోవడంతో రైతులకు రుణాలు ఇవ్వడానికి వీలు లేకుండా పోయిందన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రత్యేకాధికారినైనా నియమించి రుణాలు అందేలా చూడాలని కోరారు. లేకపోతే రైతులు చాలా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు దాదాపుగా రూ.2.50 కోట్ల మేర అప్పులు ఉండేవని, ప్రస్తుతం సుమారుగా రూ.4 కోట్ల మేర సొసైటీ లాభాల్లోకి వచ్చిందని తెలిపారు.

అయ్యప్ప స్వామి మహాపడిపూజ

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు చిత్రం శ్రీనివాస్ 18వ మెట్టు మహాపడిపూజ కార్యక్రమం శనివారం కర్మాన్‌ఘాట్‌లోని హరిహర క్షేత్రంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములు యాదవ్ మహాపడిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి ఉన్నారు.



మహాపడిపూజలో పాల్గొన్న నాయకులు

ట్రాఫిక్ పోలీసులను నియమించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మన్సూరాబాద్: రాజీవ్‌గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని అంత వరకు విద్యార్థులు రోడ్డు దాటేందుకు వారికి సహాయం చేసేందుకు ట్రాఫిక్ పోలీసులకు నియమించాలని బీఆర్ఎస్ నేత మామిడి రాంచందర్, కాంగ్రెస్ నేత జోగు రాములు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి శనివారం అడిషినల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారని రెండ్రోజుల క్రితం బస్తీకి చెందిన విద్యార్థి తల్లి రోడ్డు దాటుతుండగా బస్సు ప్రమాదానికి గురై మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అయ్యేంత వరకు పాఠశాల సమయాల్లో ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు.

తొలగించారు.. వదిలేశారు

ఎల్‌బీనగర్: విద్యుత్ తీగలకు తగులుతున్నాయని తొలగిస్తున్న చెట్ల కొమ్మలను తరలించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోజుల తరబడి రోడ్డు, రహదారులపై పక్కనే పేరుకుపోతుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లు తొలగించడమే మా పని అని విద్యుత్‌శాఖ, తరలించడం మా పని కాదని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతుండటంతో కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇరు శాఖల నడుమ సమన్వయం లేకపోవడం కాలనీవాసులు శాపంగా మారుతోంది. ఉన్నతాధికారులు స్పందించి తొలగించిన కొమ్మలను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని కాలనీలవాసులు కోరుతున్నారు.



నరికిన చెట్లను రోడ్లపైనే ఉంచిన దృశ్యం